
సాక్షి ఒడిశా

మంగళవారం । 29 । ఏప్రిల్ । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,29,867లు, వెండి 44 గ్రాముల 500మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



రైల్వేస్టేషన్ వద్ద హైఅలెర్ట్

ఉగ్రదాడి నేపథ్యంలో ప్రధాన ప్రదేశాల్లో హై అలెర్ట్ ప్రకటించారు. భద్రత పెంచారు.

- 8లో

సైబర్ మోసగాళ్లు అరెస్టు



పూరీలో వసతి పేరిట అక్రమాలకు పాల్పడిన వారు అరెస్టయ్యారు. పోలీసులు వివరాలు వెల్లడించారు.

- 8లో

న్యూస్‌రీల్

కర్ణపాడులో ఏనుగుల బీభత్సం



ఏనుగులు పీకిపారేసిన గొట్టపుబావి

రాయగడ: జిల్లాలోని కల్యాణసింగుపూర్ సమితి కర్ణపాడు గ్రామంలో ఆదివారం రాత్రి రెండు ఏనుగులు బీభత్సం సృష్టించాయి. గ్రామంలో గల గొట్టపు బావిని పీకిపారేశాయి. దీంతో గ్రామస్తులు భయభ్రాంతులు చెంది బితుకుబితుకుమంటూ రాత్రంతా గడిపారు. అనంతరం గ్రామంలో గల అరటి, మామిడి, పనస చెట్లను ధ్వంసం చేశాయి. సమాచారం తెలుసుకున్న సికరపాయి అటవీ శాఖ ఫారెస్టర్ పీకే జెన్న, వన రక్షకుడు రామ సామల్ సంఘటన జరిగిన గ్రామానికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. నష్టపోయిన బాధిత కుటుంబాల వివరాలు తెలుసుకున్నారు. సేకరించిన వివరాలను సంబంధిత శాఖ అధికారులకు తెలియజేసి నష్టపరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

నయవంచకుడిపై పోలీసులకు ఫిర్యాదు

కొరాపుట్: ప్రేమ పేరుతో నమ్మించి 16 ఏళ్ల బాలికను గర్భవతిని చేసి పరారైన నయవంచకుడిపై చర్యలు తీసుకోవాలని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు డిమాండ్ చేశారు. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న హిర్లి ప్రాంతానికి చెందిన 16 ఏళ్ల గిరిజన బాలికను ప్రేమ పేరుతో అదే ప్రాంతానికి చెందిన షేక్ అలం హుస్సేన్ నమ్మించాడు. నిజమని నమ్మిన బాలిక అతనికి సర్వం అర్పించడంతో గర్భం దాల్చింది. అయితే అనంతరం అతను కనిపించకుండా పోవడంతో స్వచ్ఛంద సంస్థలను ఆశ్రయించింది. వారి సహకారంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో షేక్ అలం హుస్సేన్‌పై ఫిర్యాదు చేసింది. తనకు న్యాయం చేయాలని పోలీసులను వేడుకుంది.

ఘాట్ రోడ్డులో లారీ బోల్తా



జయపూర్-కొరాపుట్ ఘాట్ రోడ్డులో ప్రమాదానికి గురైన కర్రల లోడు లారీ

కొరాపుట్: ఘాట్ రోడ్డులో కర్రల లోడుతో ఉన్న లారీ బోల్తా పడింది. సోమవారం కొరాపుట్-జయపూర్ మార్గంలో ఘాట్ రోడ్డులో మలుపు వద్ద ఏపీ 35 0588 నంబర్ గల లారీ అదుపు తప్పి ప్రమాదానికి గురైంది. దాంతో కర్రలు రోడ్డుకి అడ్డంగా పడ్డాయి. వాహనాలు దారి లేక ఆగిపోయాయి. వెంటనే లారీ సిబ్బంది అడ్డంగా ఉన్న కర్రలు తొలగించి మార్గం సుగమం చేశారు.

కాశీపూర్‌లో ఇద్దరు ఆత్మహత్య



కాంచన మాఝి మృతదేహం

రాయగడ : జిల్లాలోని కాశీపూర్ సమితి టికిరి పంచాయతీలోని వివాహిత కాంచన్ మాఝి (20) ఉరి వేసుకుని ఆదివారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. ఆమెకు ఏడాది కిందట కంసారిగుడ గ్రామానికి చెందిన మున్నా మాఝితో వివాహమైంది. భార్యభర్తల మధ్య వివాదాలు చోటు చేసుకోవడంతో ఆమె తన అక్క వద్ద ఉంటోంది. ఆదివారం నాడు కూలి పనులకు వెళ్లిన కాంచన ఇంటికి తిరిగి రాకపోవడంతో అక్క వెతికింది. సమీపంలొ గల ఒక చెట్టు కొమ్మకు వేలాడుతూ కాంచన మృతదేహం కనిపించింది. దీంతో పోలీసులకు సమాచారం అందించింది. ఆమె ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. అదే రోజున కాశీపూర్ గ్రామంలోని ఓ బాలిక ఆత్మహత్య చేసుకుంది. కాశీపూర్ అటవీ శాఖ రేంజ్ కార్యాలయం సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అయితే బాలిక మతిస్థిమితం బాగు లేకపోవడంతో ఈ ఘాతుకానికి పాల్పడిందని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఈ మేరకు కేసు నమోదు చేశారు.



పర్లాకిమిడి: మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ కార్యదర్శి పృథ్వీరాజ్



మల్కన్‌గిరి: మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్న బార్‌అసోసియేషన్ ప్రతినిధులు



మల్కన్‌గిరి: రక్తదానం చేస్తున్న న్యాయవాదులు

ఘనంగా ఉత్కళ గౌరవ్..
మధుసూదన్ జయంతి వేడుకలు

పర్లాకిమిడి: ఉత్కళ గౌరవ్ మధుసూదన్‌దాస్ జయంతిని పర్లాకిమిడి జిల్లా కోర్టులో లాయర్స్‌డే గా సోమవారం జరుపుకున్నారు. ముఖ్యఅతిథిగా జిల్లా జడ్జి, జిల్లా న్యాయసేవా ప్రాధికారణ అధ్యక్షులు ప్రణబ్ కుమార్ రౌత్రాయ్, ముఖ్యవక్తగా ఎస్.కె.సి.జి.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జితేంద్ర పట్నాయక్, అదనపు జిల్లా జడ్జి ప్రదీప్‌కుమార్ సోనాల, ఫ్యామిలీ కోర్టు జడ్జి అశోక్ కుమార్ సాహి, జిల్లా న్యాయ సేవా ప్రాధికరణ కార్యదర్శి బిమల్ రౌవు లో, బార్ అసోసియేషన్ అధ్యక్షులు జితేంద్ర కుమార్ పట్నాయక్, కార్యదర్శి పృథ్వీరాజ్, వినియోగదారుల ఫోరం అధ్యక్షులు రాజేంద్రపండా హాజరయ్యారు. మధుసూదన్ దాస్ ఒడిశాకు ప్రథమ పట్టభద్రులు, ప్రథమ లాయర్‌గా పనిచేశారని వక్తలు గుర్తు చేశారు. స్వతంత్ర ఒడిశా పోరాటంలో ముఖ్యపాత్ర పోషించారని జిల్లా జడ్జి ప్రణబ్‌కుమార్ రౌత్రాయ్ అన్నారు.

మల్కన్‌గిరిలో..

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్కళ గౌరవ మాధుసూదన్ దాస్ జయంతిని జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా అడిషనల్ జిల్లా జడ్జి శాంతాన్ కుమార్ దాస్ హాజరై మాధుసూదన్ దాస్ విగ్రహానికి పూలమాలాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కోర్టులో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 40 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. పలువురు లాయర్లు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అలానే ఉచిత వైద్య సేవలు, మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీత్‌పాల్ సింగ్, గోవింద పాత్రో, గోపాల్‌పండ పాల్గొన్నారు.

రాయగడ: ఉత్కళ గౌరవ్ మధుసూదన్ దాస్ చిరస్మరణీయుడని వక్తలు కొనియాడారు. మధుసూదన్ దాస్ 177వ జయంతిని పురస్కరించుకుని స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలోని ఆయన విగ్రహానికి న్యాయవాదులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాయగడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవి ప్రసాద్ పట్నాయక్, న్యాయవాదులు బ్రజసుందర్ నాయక్, బాబు రాజ్‌గురు పాల్గొన్నారు. అలాగే స్థానిక యూజీఎంఐటీ ఇనిస్టిట్యూట్‌లో సిబ్బంది కూడా మధుసూదన్ దాస్ విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

భువనేశ్వర్: ఉత్కళ గౌరవ్ మధుసూదన్ దాస్ 177వ జయంతి పురస్కరించుకుని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ, విపక్ష నేత నవీన్ పట్నాయక్, వివిధ సామాజిక, సాంస్కృతిక సంస్థలు సహా పార్టీలకు అతీతంగా ఆయనకు నివాళులర్పించారు. స్థానిక రాజ్ భవన్ స్క్వేర్ వద్ద ఉన్న ఉత్కల్ గౌరవ్ విగ్రహం దగ్గర వివిధ రంగాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో గుమిగూడి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర శాసన సభ ఆవరణలో మధు బాబు నిలువెత్తు విగ్రహం దగ్గర స్పీకరు, ముఖ్యమంత్రి ఇతర మంత్రులు, శాసన సభ సభ్యులు ఇతరేతర ప్రముఖులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆయనకు నివాళులు అర్పించింది. ఒడిశా ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడటంలో ఆయన ప్రముఖ పాత్ర పోషించి రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారు. రాష్ట్ర పారిశ్రామికీకరణలో కీలక పాత్ర పోషించారు. మధుబాబు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడానికి మా ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రత్యేక ఒడిశా ప్రావిన్స్ ఏర్పాటు, రాష్ట్ర పారిశ్రామికీకరణ, ఒడియా భాషా రక్షణకు ఆయన చేసిన అసమానమైన కృషి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని ప్రతిపక్ష నాయకుడు మరియు బిజెడి అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ తెలిపారు.



భువనేశ్వర్: శాసనసభ ఆవరణలో మధు సూదన్ దాస్ విగ్రహం దగ్గర శ్రద్ధాంజలి ఘటించిన స్పీకర్ సురమా పాఢి



భువనేశ్వర్: మధు బాబుకు పుష్పాంజలి ఘటించిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి



రాయగడ: యూజీఎంఐటీ ఇన్‌స్టిట్యూట్‌లో సిబ్బంది నివాళులు



రాయగడ: మధుసూదన్ దాస్ విగ్రహానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న న్యాయవాదులు



భువనేశ్వర్: మధుసూదన్ దాస్ చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించిన గవర్నరు డాక్టరు హరిబాబు కంభంపాటి

ట్రక్కులో రూ.కోటి విలువైన గంజాయి జప్తు



పోలీసుల అదుపులో నిందితులు



ట్రక్కులో గుర్తించిన గంజాయి

భువనేశ్వర్: నగరం గుండా గంజాయి అక్రమ రవాణా గుట్టు రట్టు అయింది. స్థానిక ఖండగిరి ప్రాంతంలో సోమవారం ఒక ట్రక్కు లోడు గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా రవాణా అవుతున్న ఈ సరుకు మార్కెట్ విలువ సుమారు కోటి రూపాయలు ఉంటుందని భావిస్తున్నారు. ఫుల్బాణీ జిల్లా నుంచి హిమాచల్ ప్రదేశ్‌కు ట్రక్కులో ఈ గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు సమాచారం. ఆకస్మిక దాడిలో అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయి పట్టుబడింది. గంజాయిని ట్రక్కుకు లోడ్ చేసిన ప్యాకెట్లలో రహస్యంగా చుట్టి ఉన్నట్లు తేలింది. ఈ దాడిలో 5 క్వింటాళ్లకు పైగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో ఈ మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటనపై తదుపరి దర్యాప్తు జరుగుతోంది.

విదేశీయుల రేషన్ కార్డులు రద్దుకు చర్యలు

భువనేశ్వర్: రాష్ట్ర ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) కింద అక్రమంగా రేషన్ కార్డులు పొందిన విదేశీ పౌరులను గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. సోమవారం ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్లు రాష్ట్ర ఆహార సరఫరాలు, వినియోగదారుల సంక్షేమ శాఖ మంత్రి కృష్ణ చంద్ర పాత్రో తెలిపారు. విదేశీయులకు జారీ చేసిన రేషన్ కార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత రద్దు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్, మయన్మార్ దేశాలకు చెందిన అనేక మంది విదేశీయులు రాష్ట్రంలో రేషన్ కార్డులు కలిగి ఉన్నట్లు తేలిందన్నారు. ఈ రేషన్ కార్డులు మరింత దుర్వినియోగం కాకుండా రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.పాకిస్తాన్, బంగ్లాదేశ్, మయన్మార్ వంటి దేశాల నుండి అక్రమ చొరబాటుదారులుగా అనుమానించబడిన అనేక మంది విదేశీయులు రాష్ట్రంలో రేషన్ కార్డులను పొందగలిగారు. వారి కార్డులు వెంటనే రద్దు చేయబడతాయి' అని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు అన్ని జిల్లా కలెక్టర్లను త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. నిరక్షమైన గుర్తింపు తర్వాత రేషన్ కార్డు డేటాబేస్ నుంచి విదేశీ పౌరుల పేర్లను తొలగించాలని పేర్కొన్నారు.

పారాదీప్‌లో అగ్ని ప్రమాదం



అగ్ని ప్రమాదంలో దగ్ధం అవుతున్న విలువైన పైపులు



పైపుల స్టాక్ యార్డ్‌లో అగ్ని ప్రమాదం

భువనేశ్వర్: పారాదీప్ జీరో పాయింట్ ప్రాంతం స్టాక్ యార్డ్‌లో సోమవారం భయానక అగ్ని ప్రమాదం సంభవించింది. ప్లాస్టిక్ పూతతో కూడిన ఇనుప పైపుల పోగులో మంటలు చెలరేగాయి. 10 యూనిట్లు పైబడి కుజంగ్ అగ్ని మాపక దళం రంగంలోకి దిగి మంటలను అదుపు చేసింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్) చమురు పైప్ లైన్ వేయడం జరుగుతోంది. మంటల్లో కోట్లాది రూపాయల విలువైన పైపులు కాలి బూడిదయ్యాయి. ఈ పైపులు ద్రవ పెట్రోలియం ఉత్పత్తులను భూగర్భం గుండా రవాణా చేయడానికి ఉద్దేశించినవి. జగత్‌సింగ్‌పూర్ జిల్లా కలెక్టర్, పోలీసు సూపరింటెండెంటు, స్థానిక థానా ఇనస్పెక్టరు ఇంచార్జి ప్రత్యక్షంగా ఘటనా స్థలం సందర్శించారు. ప్రమాదం తీవ్రతని సమీక్షించారు. మంటలను అదుపులోకి తెచ్చిన తర్వాత దానికి గల కారణాన్ని తెలుసుకోవడానికి దర్యాప్తు చేశామని అధికారులు తెలిపారు.

ఎంపీ పర్యటనపై ఉద్రిక్తత



జయపూర్ టౌన్ పోలీస్ స్టేషన్ పోలీసులు అరెస్ట్ చేసిన హిందూ సంస్థల ప్రతినిధులు



మీడియా తో మాట్లాడుతున్న కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్క



మీడియా ముందు మండిపడుతున్న జయపూర్ ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణి పతి

జయపురం, కొరాపుట్: కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్క జయపూర్ పర్యటనపై ఉద్రిక్తత నెలకొంది. ఒక్క సారిగా శాంతి భద్రతల సమస్య రేగింది. ఇటీవల పార్లమెంట్‌లో జరిగిన వక్ఫ్ బోర్డు వ్యతిరేక బిల్లు పై జరిగిన ఓటింగ్ లో పార్టీ ఆదేశానుసారం వ్యతిరేకంగా ఉల్క ఓటు వేశారు. దాన్ని నిరసిస్తూ జయపూర్‌లో హిందూ పరివార్ వర్గాలు ఆయన జయపూర్ పర్యటన అడ్డుకుంటామని హెచ్చరించాయి. ముందస్తుగా గమనించిన ఇంటెలిజెన్స్ వర్గాలు పోలీసులను హెచ్చరించారు. వెంటనే జయపూర్ పట్టణ పోలీసులు వారిని అదుపు లోనికి తీసుకున్నారు.

ఒక్కటైన ఎంపీ, ఎమ్మెల్యే వర్గాలు

ఇంత వరకు ఎంపీ ఉల్కకి స్థానిక ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి వర్గాలకు సరిపడేది కాదు. కానీ ఇప్పుడు ఎమ్మెల్యే వర్గం ఎంపీకి అండగా నిలిచింది. ఎమ్మెల్యే అనుచరులు బైక్ ర్యాలీ ద్వారా ఎంపీ ఉల్కకి స్వాగతం పలికారు. జయపూర్ మెయిన్ రోడ్డులో గల కాంగ్రెస్ కార్యాలయంలో భారీ ఎత్తున కార్యకర్తలు సమావేశం నిర్వహించారు.

పార్టీ నిర్ణయం శిరోధార్యం

పార్టీ నిర్ణయం ప్రకారం వక్ఫ్ బిల్లుకి వ్యతిరేకంగా ఓటు వేశానని, రాజ్యాంగ స్ఫూర్తి ప్రకారం నడుచుకున్నానని ఉల్క తెలిపారు. పెహల్గాంలో టెర్రరిస్టులు జరిపిన హత్యాకాండ అమానుషమని అన్నారు. ఇలాంటి హింసని ఏమాత్రం అంగీకరించకూడదన్నారు.

మీరేనా హిందువులు...నేను కాదా

ఎంపీని అడ్డుకొంటామని హెచ్చరించిన వారే హిందువులా.. మరి నేను కాదా అంటూ ఎమ్మెల్యే అన్నారు. అవసరమైతే పోరాటానికి వెనుకాడబోమన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలి



మాట్లాడుతున్న సుమంత్ కుమార్ ప్రధాన్



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షులు నబకిశోర్ శోబోరో



పాల్గొన్న ప్రజలు

పర్లాకిమిడి: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలను కూడళ్లలో ప్రతిష్టించి ఆరాధించే కంటే ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టాలని దళిత సమాజ్ సంక్షేమ సంఘం అధ్యక్షులు కె.బాలక్రిష్ణ అన్నారు. అంబేడ్కర్ సమ్మాన్ అభియాన్ పేరిట భారతీయ జనతా పార్టీ తరపున స్థానిక టౌన్ హాలులో బీజేపీ జిల్లా అధ్యక్షులు నవకిశోర్ శోబోరో ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా కోరాపుట్ ఎంపీ అభ్యర్థి కాళీరాం మఝి విచ్చేసి అంబేడ్కర్ చిత్ర పటానికి నివాళులర్పించారు. గౌరవ అతిథులుగా కొరాపుట్ జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షులు, సుమంత్ కుమార్ ప్రధాన్, స్వస్థంబ్ మాజీ కార్యదర్శి జమానా కర్రెయ్య, రజక వికాస్ పరిషత్ అధ్యక్షులు కె.మోహన్‌రావు, బీజేపీ జిల్లా సాధారణ కార్యదర్శి జగన్నాథమహాపాత్రో పాల్గొన్నారు. అంబేడ్కర్ పేద కుటుంబంలో పుట్టినా ఆయన అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించాడని జమానా కర్రెయ్య అన్నారు. భారత రాజ్యాంగం రూపొందించిన అంబేద్కర్‌తోనే వెనుకబడిన జాతులు, కులాలు ఈరోజు ఉన్నత స్థాయికి చేరుకున్నాయని కె.మోహన్‌రావు అన్నారు. కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షులు నబకిశోర్ శోబోరో అధ్యక్షత వహించగా నృసింహ చరణ్ పట్నాయక్, ఛిత్రిసింహాద్రి సహకరించారు.

క్లుప్తంగా

చిత్రకొండ జలాశయంలో చేప పిల్లలు విడుదల



జలాశయంలోకి చేపపిల్లలను విడిచి పెడుతున్న ప్రమోద్ కుమార్ జేన్నా

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితిలోని జలాశాయంలోకి కోటి రూపాయల విలువ చేసే చేపపిల్లలను జిల్లా మత్స్యశాఖ అధికారులు సోమవారం విడుదల చేశారు. సేతు యోజన పథకంలో భాగంగా వీటిని విడుదల చేసినట్టు జిల్లా మత్స్యశాఖ అధికారి ప్రమోద్ కుమార్ జేన్నా తెలిపారు. సమితిలోని తొమ్మిది పంచాయతీలకు చెందిన ప్రజలు చిత్రకొండ జలాశయంలో చేపలవేటే ఆధారంగా జీవనం సాగిస్తున్నారన్నారు. చేప పిల్లలు పెరిగి పెద్దవి అయితే అధిక రాబడి వస్తుందన్నారు.

విస్తరాకులు కుట్టిన కలెక్టర్



మిషన్ ద్వారా విస్తరాకులు కుడుతున్న నబరంగ్‌పూర్ కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రో

కొరాపుట్: నబరంగ్‌పూర్ కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రో విస్తరాకులు కుట్టి మహిళలకు స్ఫూర్తినిచ్చారు. సోమవారం జిల్లాలోని పపడాహండి సమితి సెమ్లా గ్రామంలో ఒర్మాస్ సహాయ సహకారాలతో నడుస్తున్న మాత్రుశక్తి ప్రొడ్యూసర్ ఎంటర్‌ప్రైజెస్‌ను సందర్శించారు. అక్కడ ఉన్న విస్తరాకులను మిషన్ ద్వారా కుట్టి మహిళలను ఆశ్చర్య పరిచారు.

నిలిచిన పపడాహండి-ఉమ్మర్‌కోట్ మార్గం



పపడహండి సమీపంలో రోడ్డుని ముంచెత్తిన వర్షం నీరు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా పపడాహండి-ఉమ్మర్ కోట్ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. ఇక్కడ భారీ వాన కురిసింది. పపడాహండి సమీపంలో సాయుధ స్థూపం సమీపంలో కల్వర్టు నిర్మాణంలో ఉంది. వాహనాల రాకపోకల కోసం పక్కనే తాత్కాలిక రోడ్డు నిర్మించారు. ఈ రోడ్డు మొత్తం నీటితో నిండిపోవడంతో వాహనాలు నిలిచిపోయాయి.

రోడ్డెక్కిన ప్రజలు



లక్ష్మీపూర్ సమితిలో తాగునీటి కోసం ఆందోళన చేస్తున్న ప్రజలు

కొరాపుట్: విద్యుత్, తాగునీటి కోసం సోమవారం కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ సమితి ఒడియాపెంట గ్రామ పంచాయతీ కేంద్రంలో ప్రజలు రోడ్డెక్కారు. లక్ష్మీపూర్-టికిరి మార్గంలో రోడ్డుపై ఖాళీ కుండలతో ధర్నాకు దిగారు. విద్యుత్ వైర్లు తెగిపోయి విద్యుత్ సరఫరా నిలిచిపోయిందన్నారు. గ్రామంలో తాగునీటి సరఫరా లేదని ఆరోపించారు. వెంటనే అధికారులు అక్కడకు చేరుకుని యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ వైర్లు కలపి పునరుద్ధరించారు. తాగునీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

సునాలీ కార్జికి నాలుగో ర్యాంకు



సునాలీ కార్జి

పర్లాకిమిడి: బరంపురం విశ్వవిద్యాలయం ప్లస్‌త్రీ పరీక్ష ఫలితాలు సోమవారం ప్రకటించింది. పర్లాకిమిడి మహిళా కళాశాల ప్లస్‌త్రీ డిగ్రీ విద్యార్థినులు సోషల్ సైన్సు విభాగంలో ర్యాంకులు సాధించారు. వారిలో ఒకరు సోనాలీ కార్జి సోషల్ సైన్సులో నాలుగో ర్యాంకు సాధించారు. పదో ర్యాంకును సునీతా ప్రధాన్ సాధించారు. వీరికి ప్రిన్సిపాల్ రీనా సాహు, అధ్యాపకురాలు ముదుస్మితా ప్రధాన్‌లు మెమోంటోలతో సత్కరించారు.



కలెక్టరేట్ రోడ్డులో నేలకూలిన చెట్లు



సోమవారం పర్లాకిమిడిలో కురుస్తున్న వర్షం



వర్షం వెలిసిన తర్వాత జైల్ రోడ్డులో పరిస్థితి

పర్లాకిమిడిలో వాన

పర్లాకిమిడి: గజపతి జిల్లా కొద్ది రోజులుగా మండు వేసవితో అల్లాడుతుండగా సోమవారం సాయంత్రం 5గంటల సమయంలో ఉరుములు, మెరుపులు, వానతో వాతావరణం చల్లబడింది. పర్లాకిమిడిలో వీచిన బలమైన గాలులకు కలెక్టరేట్ వద్ద చిన్నచిన్న చెట్లు నేలకూలాయి. కేవలం అరగంట మాత్రమే వర్షం కురిసినా వాతావరణం చల్లబడింది. ప్రజలు వర్షం కురిసిన తరువాత ఉపశమనం పొందారు.

ఏడుగురు సైబర్ మోసగాళ్లు అరెస్టు

భువనేశ్వర్:

పూరీ నీలాద్రీ భక్త నివాస్ మోసపూరిత వెబ్‌సైట్‌ను సృష్టించి వసతి కల్పించడంలో యాత్రికులను మోసం చేసే ప్రయత్నంలో పాల్గొన్న ప్రధాన నిందితుడితో సహా ఏడుగురిని రాష్ట్ర క్రైమ్ (సీఐడీ సైబర్ క్రైమ్) యూనిట్ విజయవంతంగా అరెస్టు చేసిందని ఆ శాఖ డైరెక్టర్ జనరల్ వినయ్‌తోష్ మిశ్రా విలేకర్లకు తెలిపారు. అరెస్టు చేసిన వ్యక్తుల్లో ప్రధాన నిందితుడు అన్షుమాన్ శర్మ (24)గా గుర్తించారు. మిగిలిన నిందితుల్లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన అరవింద్ కుమార్ (35), ఆకాష్ కేశర్వాణి (33), గుజరాత్‌కు చెందిన హితేష్‌భాయ్ పాత్రో (39), పార్థ్ పర్మార్ (25), ఠక్కర్ కర్సాంజి శోభాజీ (48), కురేషి మహ్మద్ అస్లాం (31) ఉన్నారు. పూరీలోని శ్రీ జగన్నాథ ఆలయ ప్రధాన నిర్వాహకుడి (సీఏఓ) లిఖిత పూర్వక ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. నకిలీ వెబ్‌సైట్ సృష్టించి పుణ్య క్షేత్రం పూరీలో వసతి సదుపాయం కల్పిస్తామని మోసగిస్తున్నట్లు ప్రజలు, భక్తుల నుంచి అనేక ఫిర్యాదులు దాఖలు కావడంతో చర్యలు తీసుకోవాలని శ్రీ మందిరం సీఏఓ ఫిర్యాదు రాష్ట్ర క్రైం శాఖకు ఫిర్యాదు చేశారు. అమాయకపు యాత్రికులను వాట్సాప్ ద్వారా మొబైలు నంబరుకు పూరీ పుణ్య క్షేత్రంలో నీలాద్రి భక్త నివాస్‌లో వసతి సదుపాయం ఖరారు చేసినట్లు మోసగించి ఆన్‌లైన్‌లో చెల్లింపులు ప్రేరేపించి మోసాలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులో వివరించారు.

మోసగాళ్లు కెనరా బ్యాంకులోని సేవింగ్స్ బ్యాంక్ ఖాతా (ఖాతా నంబర్: 110217193478) లోకి చెల్లింపులు స్వీకరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అన్షుమాన్ శర్మ వెబ్‌సైట్‌ను మే 22, 2024న సృష్టించాడని తేలింది. ఫిర్యాదు నమోదైన వెంటనే ఆ మోసపూరిత సైట్‌ను తొలగించారు. అక్రమ లావాదేవీలకు బ్యాంకు ఖాతాను ఉపయోగించిన మరో సహచరుడు అరవింద్ కుమార్‌ను కూడా దర్యాప్తులో గుర్తించారు. అరెస్టు చేసిన అనుమానితుల నుంచి ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులు, నీలాద్రి భక్త నివాస్ వెబ్‌సైట్‌కు సంబంధించిన వివరాలు, ఆధార్ కార్డులు, పాన్ కార్డులు, గోడాడీ హోస్టింగ్ సమాచారం, వెబ్‌సైట్‌ను రూపొందించడానికి ఉపయోగించిన రిజిస్టర్డ్ సిమ్ కార్డ్‌తో సహా అనేక వస్తువులను దర్యాప్తు బృందం స్వాధీనం చేసుకుంది.



విలేకర్ల సమావేశంలో రాష్ట్ర క్రైమ్ శాఖ డైరెక్టర్ జనరల్ వినయ్‌తోష్ మిశ్రా

ఈ మోసపూరిత వ్యవహారంలో 4 వేర్వేరు కేసులు దాఖలు చేశారు. వీటి దర్యాప్తు కొనసాగించడానికి 2 దర్యాప్తు బృందాలను గుజరాత్ (అహ్మదాబాద్, ఆనంద్ జిల్లా, సూరత్) ఉత్తరప్రదేశ్‌కు పంపారు.

రూ.1.28 కోట్లు మోసం

గుజరాత్‌లోని సూరత్‌కు చెందిన హితేష్‌భాయ్ పాత్రో (39) ఖాతాలో నేరుగా రూ. 27 లక్షలు జమ అయిన ఆధారంతో ఆయనను అరెస్టు చేశారు. 6 చెక్ పుస్తకాలు, 31 డెబిట్/క్రెడిట్ కార్డులు, నకిలీ కంపెనీల 13 రబ్బరు స్టాంపులు, 12 మొబైల్ హ్యాండ్‌సెట్‌లు, సిమ్ కార్డులు, 4 పెన్ డ్రైవ్‌లు ఎనిమిది ప్రభుత్వ, ప్రభుత్వేతర ఐడిలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు దర్యాప్తులో సమగ్రంగా రూ.1.28 కోట్లు భారీ మోసం బట్టబయలైందని డీజీ పేర్కొన్నారు.

రూ. 7.5 కోట్లు భారీ మోసం

ఈ మోసం వ్యవహారంలో అహ్మదాబాద్‌కు చెందిన పార్థ్ పర్మార్ (25) ప్రాథమిక ఖాతాదారుడిగా వ్యవహరించినట్లు ధృవీకరించి అరెస్టు చేశారు. అతని ఖాతాలో ప్రత్యక్షంగా రూ. 25 లక్షలు జమ అయినట్లు పేర్కొన్నారు. పోలీసులు అతని మొబైల్ ఫోన్, ఆధార్ కార్డు మరియు పాన్ కార్డును స్వాధీనం చేసుకుని కొనసాగించిన దర్యాప్తులో మోసం పరిమాణం రూ.7.5 కోట్లుగా తేలింది.

రూ. 87.8 లక్షల మోసం

ఈ కేసులో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. గుజరాత్‌లోని బనస్కాంతకు చెందిన ఠక్కర్ కర్సాంజీ శోభాజీ (48) తన ఖాతాలో రూ. 9.3 లక్షలు జమ చేసినట్లు గుర్తించడంతో ఈ డొంక కదిలింది. గుజరాత్‌లోని ఖేడా జిల్లాకు చెందిన కురేషి మొహమ్మద్ అస్లాం (31) ఖాతాలో రూ. 6 లక్షలు జమ అయినట్లు తేలింది. వీరి దగ్గర నుంచి మొబైల్ ఫోన్లు, ఆధార్ కార్డులు, పాన్ కార్డులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

రూ. 1.4 కోట్లు మోసం

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు చెందిన ఆకాష్ కేషర్వానీ (33) ఖాతాకు రూ. 3.7 లక్షలు బదిలీ ఆధారంగా అతడిని అరెస్టు చేశారు. అతని దగ్గర నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువుల్లో మొబైల్ ఫోన్లు, ఆధార్ కార్డులు, పాన్ కార్డులు ఉన్నాయి. తదుపరి దర్యాప్తులో ఇలాంటి మోసపూరిత కార్యకలాపాలలో అదనపు కరెంట్ ఖాతాల ప్రమేయం ఉన్నట్లు తేలింది. ఈ కేసుపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ నేరంలో ఇతర భాగస్వాములను, దాని ట్రాన్స్ ఇండియా పరిణామాలను, డబ్బు జాడను దర్యాప్తు బృందం కనుగొంటుందని తెలిపారు.

హైటెక్ గ్రూప్ బిశ్వజిత్ పాణిగ్రాహికి సత్కారం



రాష్ట్ర వైద్య సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ముఖేష్ మహాలింగ చేతులమీదుగా మెమొంటో అందుకుంటున్న హైటెక్ గ్రూప్స్ డైరక్టర్ బిశ్వజిత్ పాణిగ్రాహి

పర్లాకిమిడి: ఉన్నత విద్య, ఆరోగ్యశాఖలో అనేక విప్లమాత్మక మార్పులు తెచ్చిన ఒడిశాలోని హైటెక్ గ్రూప్ మెడికల్ కళాశాలల డైరక్టర్ బిశ్వజిత్ పాణిగ్రాహిని రాష్ట్ర వైద్య, కుటుంబ సంక్షేమ సంఘం మంత్రి డాక్టర్ ముఖేష్ మహాలింగ సోమవారం భువనేశ్వర్‌లో మెమొంటోతో సత్కరించారు. భువనేశ్వర్‌లో జరిగిన కాన్‌క్లేవ్ ఒడిశా కార్యక్రమంలో బిశ్వజిత్‌ను సత్కరించారు. బిశ్వజిత్ పాణిగ్రాహి హైటెక్ మెడికల్ కళాశాలల మేనేజింగ్ ట్రస్టీ సురేష్ కుమార్ పాణిగ్రాహి కుమారుడు. రూర్కెలా, భువనేశ్వర్, తిరుపతిలో వైద్య కళాశాలలు నెలకొల్పిన చైర్మన్ డాక్టర్ తిరుపతి పాణిగ్రాహి సంతానం సురేష్‌కుమార్ పాణిగ్రాహి.

ముగిసిన రెడ్‌క్రాస్ శిక్షణ శిబిరం



ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న శిక్షణ పొందినవారు

జయపురం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రారంభమైన రాష్ట్రస్థాయి జూనియర్ రెడ్‌క్రాస్ శిక్షకుల శిక్షణ శిబిరం సోమవారం సాయంత్రం సెమిలిగుడ ఉన్నత పాఠశాలలో ముగిసిందని నిర్వాహకులు తెలిపారు. సోమవారం ప్రధమ కార్యక్రమంలో సాధన కర్మి రామచంద్ర పాల్ హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌లపై వివరించి వాటి నియంత్రణకు తీసుకోవలసిన జాగ్రత్తలుం వివరించినట్లు వెల్లడించారు. ముగింపు కార్యక్రమంలో అగ్నిమాపక విభాగ అధికారి శ్రీపతి స్వైయ్ అగ్ని ప్రమాదాలలో బాధితులను రక్షించటంలో రెడ్ క్రాస్ కార్యకర్తలు అనుసరించాల్సిన పద్ధతులను వివరించారు. రాష్ట్ర జూనియర్ రెడ్‌క్రాస్ సాధన కర్మి యజ్ఞేశ్వర పండ ప్రకృతి ప్రమాదాలలో అనుసరించాల్సిన విధానాలు, బాధితుల రక్షణలో తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేశారు. జూనియర్ రెడ్‌క్రాస్ అధికారి హరేకృష్ణ మహారాణ అధ్యక్షతన రెండవ అధివేషన్ జరిగింది. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జీవిత కాల సభ్యులు షేక్ ఇబ్రహిమ్, జగన్నాథ్ విద్యాపీఠం, సునాబెడ ప్రధాన ఉపాధ్యాయులు సిద్ధార్థ మహాపాత్రో రెడ్‌క్రాస్ ప్రాధాన్యతను వివరించారు. మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చేసినవారికి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలియజేశారు. ముగింపు కార్యక్రమంలో జ్యోతిరంజన్ నంద, సపన్ దీక్షిత్, తపన పారిడ, సాహెబ్ పరవిన్, శుభస్మిత సాహు, అశోక్ కుమార్ పవడ పాల్గొన్నారు. సెమిలిగుడ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు విష్ణుప్రియ సామంతసింహార్ ధన్యవాదాలు తెలియజేశారు.

భువనేశ్వర్ స్టేషన్ వద్ద హై అలర్ట్



భువనేశ్వర్ రైల్వే ప్లాట్‌ఫారమ్‌పై ఆర్పీఎఫ్ ఫ్లాగ్ మార్చ్

భువనేశ్వర్: పహల్గామ్ ఉగ్రవాద దాడి నేపథ్యంలో నగరంలో రైల్వేస్టేషన్ల వంటి ముఖ్యమైన ప్రదేశాల్లో భద్రతా చర్యలు పటిష్టపరిచారు. ఆయా ప్రాంగణాల్లో ప్రయాణికులు, సిబ్బంది ఇతరేతర ప్రజలకు ఏమాత్రం భద్రత లోపించకుండా అవాంఛనీయ సంఘటనల నివారణకు అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారు. ప్రత్యేక భద్రతా ఏర్పాట్లలో భాగంగా రైల్వే రక్షక దళం (ఆర్పీఎఫ్) సిబ్బంది సోమవారం స్థానిక రైల్వే స్టేషన్‌లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ప్లాట్‌ఫామ్‌ల వద్ద ఎవరైనా అనుమానాస్పద వ్యక్తి లేదా ఏదైనా సందిగ్ధ సామాన్లు చూస్తే తెలియజేయాలని ప్రయాణికులకు ఆర్పీఎఫ్ అధికారులు కోరారు. ప్రయాణికులను లగేజీని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఈ పరిశీలనలో అధునాతన నిఘా వ్యవస్థలను ఉపయోగించి ప్రయాణికుల కదలికలను పర్యవేక్షించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రవేశ, నిష్క్రమణ ప్రాంగణాలు, ప్లాట్‌ఫారమ్, పార్కింగ్ ప్రాంతాల వద్ద అదనపు భద్రతా సిబ్బందిని మోహరించారు. ఆయా ప్రాంగణాల్లో నిఘాను బలోపేతం చేశారు. ప్రజల కదలికలను నిశితంగా పరిశీలిస్తున్నట్లు ఒక అధికారి తెలిపారు. తనిఖీల సమయంలో భద్రతా సిబ్బందికి సహకరించాలని, ఏవైనా లగేజీలు లేకపోవడాన్ని లేదా అనుమానాస్పద ప్రవర్తనను వెంటనే నివేదించాలని ప్రయాణికులను అభ్యర్థించారు. భద్రతా స్క్రీనింగ్ కోసం అవసరమైన అదనపు సమయం కేటాయించేందుకు ప్రయాణికులు స్టేషన్‌కు రైలు ప్రయాణం సమయం కంటే ముందుగానే స్టేషనుకు చేరుకోవాలని రక్షణ అధికారులు అభ్యర్థించారు.

కాంగ్రెస్ పార్టీ నాయకుడు మృతి



పి.బాలాజీ(ఫైల్)

కొరాపుట్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పి. బాలాజీ (57) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న జయపూర్ ఎమ్మెల్యే తారాప్రసాద్ భాహీణీ పతి, మున్సిపల్ మాజీ చైర్మన్ మీనాక్షి బాహీనీ పతి, జయపూర్ మున్సిపల్ చైర్మన్ నౌరి మహంతి, వైస్ చైర్మన్ బి.సునీత తదితరులు కాపు వీధిలోని ఆయన స్వగృహానికి వచ్చిన బాలాజీ మృతదేహానికి నివాళులర్పించారు.అంతిమ యాత్రలో పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు. కాగా బాలాజీ భార్య పి.రామలక్ష్మి 11వ వార్డు కౌన్సిలర్‌గా వ్యవహరిస్తున్నారు.

పొలాల్లోకి కలుషిత నీరు



వస్తున్న వ్యర్థాలు

కొరాపుట్: కలుషిత నీటితో పంట పొలాలు పాడవుతున్నాయి. కొరాపుట్ జిల్లా కేంద్రం నుంచి సేకరించిన వ్యర్థాలను డంపింగ్ యార్డులో వేస్తున్నారు. కానీ మురుగు నీరు మాత్రం రంగబలి కుంబ చంపాగు సెంటర్ ప్రాంతాల వైపు వెళ్తోంది. ఆ ప్రాంతంలో పొలాల్లో నిల్వ ఉండిపోతోంది. ఈ నీరు వెళ్లే మార్గం మళ్లించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎమ్మెల్యే కద్రక ఔదార్యం



వృద్ధులతో మాట్లాడుతున్న కద్రక

రాయగడ: రాయగడ ఎమ్మెల్యే అప్పల స్వామి కద్రక మానవత్వాన్ని చాటుకున్నారు. స్థానిక ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై కొందరు వృద్ధులు సోమవారం మధ్యాహ్నం నడుచుకుంటూ వెళుతుండటం చూసి తన వాహనాన్ని ఆపి వారిని కలిశారు. ఎక్కడకు వెళుతున్నారని ఆరా తీశారు. ఇంత ఎండలో నడుచుకుంటూ వెళ్లాల్సిన అవసరం ఏమిటని అడిగారు. తాము సదరు సమితి పరిధి తడమ పంచాయతీలోని లుహాకాల్ గ్రామం నుంచి వచ్చామని వారంతా సమాధానం చెప్పారు. పింఛన్ తీసుకునేందుకు తామంతా 11 కిలోమీటర్ల దూరం నుంచి వచ్చామని వివరించారు. ఆటో కోసం పడికాపులు కాచినప్పటికీ లభించకపోవడంతో గత్యంతరం లేక నడుచుకుంటూ సమీపంలోని కొత్తబస్టాండుకు వెళుతున్నామని చెప్పారు. వివరాలు సేకరించిన ఎంఎల్ఏ కద్రక ఆటోలను రప్పించి వారి వారి గ్రామాలకు తరలించారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న పెన్సన్ ను ఇటువంటి తరహా వృద్ధులకు ఇంటికి తీసుకువెళ్లి ఇచ్చే సౌకర్యం కల్పించేలా ప్రభుత్వ దృష్టికి తీసుకువెళతానని ఈ సందర్భంగా కద్రక చెప్పారు.

వినతుల స్వీకరణ



కొరాపుట్: దశమంత్‌పూర్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఏడీఎం దేవీప్రసాద్



కొరాపుట్: నబరంగ్‌పూర్ దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందజేస్తున్న కలెక్టర్ శుభంకర్ మహాపాత్రో, ఎస్పీ మిహిర్ పండా



రాయగడ: సమస్యలు వింటున్న కలెక్టర్, అధికారులు

రాయగడ: జిల్లాలోని పద్మపూర్ సమితి కార్యాలయం ప్రాంగణంలో సోమవారం వినతుల స్వీకరణ కార్యక్రమం జరిగింది. జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారి అధ్యక్షత వహించారు. గుణుపూర్ సబ్ కలెక్టర్ కిరణ్‌దీప్ కౌర్ సహోట, జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహక అధికారి అక్షయ కుమార్ ఖెముండొ, పద్మపూర్ సమితి అధ్యక్షురాలు మణిమాల సబర్ తదితరులు వినతులు స్వీకరించారు. సమితిలోని వివిధ గ్రామాలకు చెందిన 18 సమస్యలు కలెక్టర్ దృష్టికి వచ్చాయి. ఇందులో 15 వ్యక్తిగతమైన సమస్యలు, మిగతా మూడు గ్రామ సమస్యలుగా గుర్తించారు. ఇద్దరికి రెడ్ క్రాస్ నిధుల నుంచి పదివేల రుపాయలను కలెక్టర్ అందించారు.

కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో..

కొరాపుట్: కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో అధికారులు గ్రీవెన్స్ నిర్వహించారు. నబరంగ్‌పూర్ జిల్లా పపడాహండి సమితి కేంద్రంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. 62 ఫిర్యాదులు రాగా.. వాటిలో 40 వ్యక్తిగత, 22 సామాజిక ఫిర్యాదులు వచ్చాయి. దివ్యాంగుతకు ట్రైసైకిళ్లు ఉచితంగా అందజేశారు. ఎస్పీ మిహిర్ పండా పాల్గొన్నారు. కొరాపుట్ జిల్లా దశమంత్‌పూర్ ఏడీఎం దేవీప్రసాద్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

బొడొనాలో డ్యామ్ సందర్శన

రాయగడ: జిల్లాలోని కెందుగుడ ప్రాంతంలో గల బొడొనాలో డ్యామ్‌ను జిల్లా కలెక్టర్ ఫరూల్ పటావ్రి సోమవారం సందర్శించారు. అక్కడ గల మత్స్యకారులతో కాసేపు మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేటకు వెళ్లే మత్స్యకారులు తీసుకుంటున్న జాగ్రత్త చర్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. చేపల వేటనే జీవనోపాధిగా బతకు బాటు కొనసాగిస్తున్న మత్స్యకారులకు అండగా ఉంటామన్నారు. డ్యామ్ నుంచి సేకరించిన చేపలను వీధుల్లో తిరిగి విక్రయించే మహిళలతో కాసేపు ముచ్చటించారు. ప్రభుత్వం మత్స్యకారులకు అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సుందర్‌గఢ్ దుళింగ బొగ్గు గనిలో ప్రమాదం

భువనేశ్వర్: సుందర్‌గఢ్ దుళింగ బొగ్గు గనిలో సోమవారం ఉదయం ప్రమాదం సంభవించింది. ఆపరేటర్లకు తీసుకుని వెళ్తున్న బస్సు గనిలో బోల్తా పడింది. బస్సులో 30 మందికి పైగా ఆపరేటర్లు ఉన్నారు. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ఆరుగురికి పైగా గాయపడ్డారు. చికిత్స కోసం క్షతగాత్రులను బ్రజ్‌రాజ్‌నగర్‌లోని ఆస్పత్రిలో చేర్చారు. మృతుడు పుదాపల్లి నివాసి నిత్యానంద ప్రధాన్‌గా గుర్తించారు. ఘటనా స్థలంలో కాసేపు ఉద్రిక్తత నెలకొంది.

ఓఎస్ఆర్టీసీ ఉద్యోగుల ఆందోళన



ఓఎస్ఆర్టీసీ కార్యాలయం ఎదుట బైఠాయించిన డ్రైవర్లు, కండక్టర్లు, కుటుంబ సభ్యులు

రాయగడ: స్థానిక కొత్తస్టాండు వద్ద గల ఓఎస్ఆర్టీసీ కార్యాలయం ఎదుట సోమవారం ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. గత 38 రోజులుగా ఓఎస్ఆర్టీసీలో పనిచేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లకు ప్రభుత్వం జీతాలు చెల్లించడం లేదన్నారు. తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తు డ్రైవర్లు, కండక్టర్లతోపాటు వారి కుటుంబ సభ్యులు ఆందోళనలో పాల్గొన్నారు. జీతభత్యాలు చెల్లించకపోవడంతో పాటు అసలు పనులు కల్పిస్తారో, లేదో తెలియని అనిశ్చిత పరిస్థితి నెలకొందని వారంతా ఆరోపించారు. రాయగడ ఓఎస్ఆర్టీసీ డిపో పరిధిలో రాయగడ, కొరాపుట్ జిల్లాల ప్రయాణీకులకు బస్సు సేవలు అందిస్తుండేవి. అత్యంత పాత బడిన బస్సులను నమామాత్రంగా నడిపిస్తున్న ప్రభుత్వం వాటి ఆలనాపాలనను పూర్తిగా మరిచిపోయింది. దీంతో బస్సుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. గతకొద్ది రోజుల క్రితం డిపోలో నడుస్తున్న పాత బస్సులు కండీషన్ సరిగా లేకపోవడంతో పాటు ఫిట్‌నెస్ లేవని ఆర్టీఓ అధికారి బస్సులను రద్దు చేశారు. అప్పటి నుంచి బస్సులు నడవకపోవడంతొ పాటు బస్సుల్లో పనిచేసే డ్రైవర్లు, కండక్టర్లు పనులు లేక ఖాళీగా ఉండేవారు. బస్సులను యథావిధిగా నడిపించడం లేదు సరికదా తమకు జీతాలు కూడా చెల్లించలేని పరిస్థితి నెలకొనడంతో డ్రైవర్లు, కండక్టర్లు ఆందోళనకు దిగారు. 2015లో రాయగడ ఓఎస్ఆర్టీసీ డిపో ఏర్పాటైంది. ఈ డిపో పరిధిలో రాయగడ, కొరాపుట్ జిల్లల్లో 9 రూట్లలో 11 బస్సులు నడుస్తుండేవి. ఈ బస్సుల్లో పనిచేస్తున్న 14 మంది డ్రైవర్లు, 12 మంది కండక్టర్లు జీవనోపాధి పొందుతుండేవారు.

వక్ఫ్ బిల్లు ముస్లింలకు వ్యతిరేకం కాదు



కలహండిలో ప్రసంగిస్తున్న నబరగ్‌పూర్ ఎంపీ బలబద్ర మజ్జి,ప్రక్కనే కలహండి ఎంపీ మాళవిక దేవి, ఎంఎల్ఏ సుధీర్ రంజన్ పటజోషి

కొరాపుట్: ఈ నెల రెండో వారంలో కేంద్రం తెచ్చిన వక్ఫ్ బిల్లు ముస్లింలకు వ్యతిరేకం కాదని బీజేపీకి చెందిన నబరంగ్‌పూర్ ఎంపీ బలబద్ర మజ్జి పేర్కొన్నారు. సోమవారం కలహండి జిల్లా భవానిపట్నలో ఇండియన్ ఫుడ్ పార్క్‌లో జరిగిన బీజేపీ వర్క్‌షాప్‌లో కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు. ఈ బిల్లు లోక్ సభ, రాజ్యసభలలో అనుమతి పొందిందన్నారు. వక్ఫ్ రూల్స్ వలన ముస్లిం సోదరులు, సోదరీ మణులు గతంలో చాలా ఇబ్బందులు పడ్డారన్నారు. ఇకపై ఆ కష్టాలు ఉండవని చెప్పారు. పేద ముస్లిం లకు ఈ బిల్లు ప్రస్తుతం సహాయం చేస్తుందని బలబద్ర మజ్జి పేర్కొన్నారు.ఈ సమావేశంలో కలహండి ఎంపీ రాజమాత మాళవిక దేవి, ఎంఎల్ఏ సుదీర్ రంజన్ పటజోషిలు పాల్గొన్నారు.

ఘనంగా చాంబర్ ఆఫ్ కామర్స్ స్వర్ణోత్సవాలు



స్వర్ణోత్సవ సావనీర్‌ను విడుదల చేస్తున్న ప్రముఖులు

కొరాపుట్: జయపూర్ చాంబార్ ఆఫ్ కామర్స్ స్వర్ణోత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. కొరపుట్ ఎంపీ సప్తగిరి ఉల్క ఉత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో శాంతి భద్రతలు బాగుంటే వర్తక వాణిజ్య రంగాలు అభివృద్ధి పథంలో నడుస్తాయన్నారు. ఈ సందర్భంగా స్వర్ణోత్సవానికి సంబంధించి సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జయపూర్ ఎమ్మెల్యే తారా ప్రసాద్ భాహిని పతి, మున్సిపల్ చైర్మన్ నౌరి మహంతి, వైస్ చైర్మన్ బి.సునీత, ప్రెసిడెంట్ ప్రభాకర్, సెక్రటరీ డి.మాధవ, సలహాదారుడు శశి పట్నాయక్, అవిభక్త కొరాపుట్ జిల్లాల నుంచి వచ్చిన చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు పాల్గొన్నారు.

కేసీసీ బ్యాంక్‌లో రక్తదాన శిబిరం

కొరాపుట్: కొరాపుట్ సెంట్రల్ కో ఆపరేటివ్ బ్యాంక్ (కేసీసీబీ) కేంద్ర కార్యాలయంలో రకదాన శిబిరం జరిగింది. సోమవారం జయపూర్ ఎన్‌కేటీ రోడ్డులో ఉన్న కార్యాలయ ఆవరణలో 53 మంది రక్త దాతలు రక్త దానం చేసారు. బ్యాంక్ సిబ్బంది, ల్యాంప్స్ ఉద్యోగులు,యువత రక్త దానం చేసారు. ఈ కార్యక్రమంలో కేసిసి బ్యాంక్ ప్రెసిడెంట్ ఈశ్వర్ చంద్ర పాణీగ్రాహీ పాల్గొన్నారు.

క్లుప్తంగా

సృజన శ్రీకర్‌కు గిన్నిస్‌బుక్‌లో స్థానం


గిన్నిస్‌బుక్‌లో స్థానం దక్కించుకున్న విద్యార్థి సృజనశ్రీకర్

చీపురుపల్లిరూరల్ (గరివిడి): గరివిడి పట్టణానికి చెందిన ఐదో తరగతి విద్యార్థి ధర్మవరపు సృజనశ్రీకర్ గిన్నిస్ బుక్‌లో స్థానం దక్కించుకున్నాడు. విజయవాడకు చెందిన హల్లెల్ మ్యూజిక్ స్కూల్ వ్యవస్థాపకుడు పాస్టర్ అగస్టీన్ దండంగి ఆధ్వర్యంలో డిసెంబర్ 1న 18 దేశాలకు చెందిన 1090 మంది విద్యార్థులు 60 నిమిషాలలో అందరూ ఏకకాలంలో కీబోర్డు ప్లే చేసి ఇన్‌స్టాగామ్‌లో అప్‌లోడ్ చేశారు. వీరిలో 1046 మంది విద్యార్థులు గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు. వీరిలో గరివిడి పట్టణంలోని ఈహెచ్ కాలనీకి చెందిన పాస్టర్ ధర్మవరపు ప్రసాదరావు, వెంకటలక్ష్మి దంపతుల కుమారుడు సృజనశ్రీకర్ కూడా ఉన్నాడు. ఈ నెల 25న విజయవాడలోని మెట్రోపాలిటన్ మిషన్ చర్చిలో సృజనశ్రీకర్ ప్రశంసాపత్రం అందుకున్నట్లు తల్లిదండ్రులు తెలిపారు.

కబ్జాదారుడిపై చర్యలు తీసుకోండి..

- కలెక్టర్‌కు చీపురుపల్లి రైతుల వినతి


ఫిర్యాదుపత్రాలతో చీపురుపల్లి రైతులు


విజయనగరం అర్బన్: చీపురుపల్లి రెవెన్యూ పరిధిలోని రైతులు, ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్న జనసేన నాయకుడు విసినిగిరి శ్రీనుపై చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను సోమవారం కలసి వినతిపత్రం అందజేశారు. విసినిగిరి శ్రీను చేసిన భూ కబ్జాలపై తహసీల్దార్, ఆర్డీఓ స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. చీపురుపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల దగ్గర గెడ్డ పోరంబోకు భూమిని ఆక్రమించి విక్రయించాడని ఆరోపించారు. అలాగే చీపురుపల్లి – రాజాం మార్గంలోని ఆర్‌అండ్‌బీ రోడ్డుని ఆనుకుని సుమారు రెండెకరాల ఉమా రామలింగేశ్వరస్వామి దేవస్థానం భూమిని ఆక్రమించి దానిని ప్లాట్లుగా విక్రయించాడని చెప్పారు. ఆక్రమణదారుడిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో కొసిరెడ్డి రమణ, గవిడి సురేష్, రెడ్డి గోపి, కరణం ఆదినారాయణ, డబ్బాడ ఆనంద్, పండు, సత్యం, వెంకీ, తదితరులు ఉన్నారు.

ఆరు కిలోల గంజాయి స్వాధీనం


నిందితులతో ఎస్.కోట సీఐ, సిబ్బంది

శృంగవరపుకోట: అక్రమంగా తరలిస్తున్న ఆరు కిలోల గంజాయిని ఎస్.కోట పోలీసులు సోమవారం మధ్యాహ్నం స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు ఎస్.కోట పోలీసులు పందిరప్పన్న జంక్షన్‌లో వాహన తనిఖీలు చేపడుతుండగా.. మోటార్ సైకిల్‌పై వస్తున్న ఒడిశాకు చెందిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా..వారి వద్ద ఆరు కిలోల గంజాయి పట్టుబడింది. గంజాయి, బైక్‌ను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ వి. నారాయణమూర్తి తెలిపారు.

'పీఎం సూర్యఘర్'పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఈఈ సురేష్‌బాబు

రాజాం సిటీ: పీఎం సూర్యఘర్ పథకంతో ఎంతో ప్రయోజనం ఉంటుందని విద్యుత్ శాఖ ఈఈ జి.సురేష్‌బాబు అన్నారు. స్థానిక పట్టణంలోని వస్త్రపురి కాలనీలోని ప్రజలకు పీఎం సూర్యఘర్ పథకంపై సోమవారం అవగాహన కల్పించారు. సబ్సిడీ ద్వారా లభించే ఈ పథకానికి బ్యాంకులే రుణ సదుపాయం కల్పిస్తాయన్నారు. విద్యుత్ సోలార్ ప్యానెల్ వినియోగం ద్వారా విద్యుత్‌ను ఆదా చేయవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏడీ ఫణీంద్రకుమార్, ఏఈ ఓజేసీపీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మారికను వదులుకోం..

- అదానీ కోసం ఇళ్లు, భూములు కోల్పోవాల్సిన అవసరం లేదు
- తహసీల్దార్ కార్యాలయం వద్ద గిరిజనుల ఆందోళన
- వంటావార్పుతో నిరసన


తహసీల్దార్ కార్యాలయం వద్ద గిరిజనులు, గిరిజన సంఘ నాయకుల ఆందోళన

వేపాడ: ఎవరి కోసమే ఇళ్లు, భూములు వదులుకోవాల్సిన అవసరం లేదని మండలంలోని మారిక గ్రామస్తులు స్పష్టం చేశారు. గ్రామ పరిసరాల్లో ఏర్పాటు చేయనున్న హైడ్రో పవర్‌ప్లాంట్ మాకొద్దంటూ మండిపడ్డారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గిరిజనులు పలు సంఘాల మద్దతుతో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అదానీ గో బ్యాక్.. కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి నశించాలి.. గిరిజన కుటుంబాలకు న్యాయం చేయాలి.. అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఏపీ రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ మాట్లాడుతూ.. గిరిశిఖరంపై ప్రకృతి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న గిరిజనులకు అన్యాయం చేయడం తగదన్నారు. గుజరాత్‌కు చెందిన ప్రైవేట్ హైడ్రోపవర్ ప్లాంట్ కోసం గ్రామాన్ని, జిరాయితీ పొలాలను వదిలి వెళ్లిపొమ్మనడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. గ్రామానికి రోడ్డు వేస్తుంటే గ్రామస్తులు ఎంతో సంతోషించారని.. అయితే అదానీ గ్రూప్ కోసం రోడ్డు వేశారన్న విషయం గ్రామస్తులు పసిగట్టలేకపోయారని చెప్పారు. మారికలో 35 సర్వే నంబర్లు ఉంటే 1 నుంచి 32 సర్వే నంబర్లలోని సుమారు 213 ఎకరాల భూములు, ఇళ్లు, బడి, గుడిని అదానీకి రాసేయడం దారుణమన్నారు. భూముల జీఓ రద్దు చేసే వరకూ పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. ఇక్కడే వంటా వార్పు చేపట్టి నిరసన చేపడతామన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, ఏపీ రైతుసంఘ జిల్లా కార్యదర్శి రాంబాబు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి మద్ది రమణ, పాల రైతుల సంఘ జిల్లా కార్యదర్శి గొంప కృష్ణమూర్తి, వ్యవసాయకార్మిక సంఘ నాయకుడు గాడి అప్పారావు, సీపీఎం నేతలు శ్యామ్, పాతమారిక, కొత్తమారిక గిరిజనులు పాల్గొన్నారు.


వంటావార్పులో భాగంగా నిరసన చేపడుతున్న గిరిజనులు

గిరిజనులకు అండగా ఉంటాం..



గిరిజనుల న్యాయ పోరాటానికి అండగా ఉంటాం. మారిక గ్రామాన్ని అదానీకి రాసి ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తున్నాం. గిరిజనుల పోరాటానికి పూర్తి స్థాయిలో మద్దతిస్తాం. తక్షణమే జీఓను వెనక్కితీసుకుని గిరిజనులకు న్యాయం చేయాలి.

– రాంబాబు, ఏపీ రైతుసంఘ రాష్ట్ర కార్యదర్శి

కార్పొరేట్ శక్తుల సేవలో పెద్దలు..



ప్రధాని మోదీ, తదితరులు కార్పొరేట్ శక్తుల సేవలో బిజీగా ఉన్నారు. పేద ప్రజలపై కనీసం దృష్టి సారించకపోవడం బాధాకరం. దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టడం న్యాయం కాదు. గిరిజన గ్రామాల్లో విద్య, వైద్య సదుపాయాలు కల్పించాల్సింది పోయి వారి భూములు లాక్కోవడం ఎంతవరకు సమంజసం. గిరిజనులకు అండగా చివరి వరకు పోరాడుతాం.

– తమ్మినేని సూర్యనారాయణ, సీపీఎం జిల్లా కార్యదర్శి, విజయనగరం

పోరాటం ఆపేది లేదు..



భూములు కేటాయిస్తూ ఇచ్చిన జీఓ రద్దు చేసే వరకూ పోరాటం కొనసాగిస్తాం. ఎట్టి పరిస్థితుల్లోనూ మారిక గ్రామాన్ని వదులుకోం. పోడు వ్యవసాయం చేసుకుని కాలం వెళ్లదీస్తున్న గిరిజనులకు అన్యాయం చేయాలనుకోవడం మంచి పద్ధతి కాదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం సామన్యులకు అండగా నిలవాలే తప్ప కార్పొరేట్ శక్తులకు కాదు.

– పాతబోయిన పెంటమ్మ, సర్పంచ్, కరకవలస పంచాయతీ, మారిక గ్రామం

నిర్ణీత సమయంలో సమస్యలు పరిష్కరించండి

- ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి


వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధించిన స్టేషన్ అధికారులకు ఫోన్‌లో ఆదేశాలు జారీచేస్తున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి

పార్వతీపురం రూరల్: ప్రజలు తెలియజేసిన సమస్యలను నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి ఆదేశించారు. సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కుటుంబ కలహాలు, వేధింపులు, భూ, ఆస్తి వివాదాలు, సైబర్ మోసాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీల వసూళ్లు, ప్రేమ పేరుతో మోసాలపై అర్జీలు వచ్చాయి. అనంతరం వివిధ స్టేషన్‌ల సిబ్బందితో ఫోన్‌లో మాట్లాడి, ఫిర్యాదులపై ఆరా తీశారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ సీఐ ఆదాం, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

39 అర్జీల స్వీకరణ...

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీ వకుల్ జిందల్, తదితరులు 39 అర్జీలు స్వీకరించారు. బాధితులతో ముఖాముఖి మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం ఆయా పోలీస్‌స్టేషన్‌ల ఎస్‌హెచ్‌ఓలతో వీడియో కాల్ ద్వారా మాట్లాడుతూ... ఫిర్యాదుదారుల సమస్యలను వారం రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదుల వాస్తవ నివేదికలను తన కార్యాలయానికి పంపాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, ఎస్‌బీ సీఐలు లీలారావు, చౌదరి, డీసీఆర్‌బీ ఎస్సై రాజేష్, పీఆర్‌ఓ కోటేశ్వరరావు, సిబ్బంది కిషోర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.


ఫిర్యాదుదారుల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ వకుల్ జిందల్, ఏఎస్పీ సౌమ్యలత

ఘోషా ఆస్పత్రి సిబ్బందికి ఎక్స్‌లెన్స్ అవార్డు


ఘోషా ఆస్పత్రి కౌన్సిలర్లు, ల్యాబ్ టెక్నీషియన్‌కు అవార్డు అందజేస్తున్న ప్రిన్సిపాల్ పద్మలీల

విజయనగరం ఫోర్ట్: ఘోషా ఆస్పత్రి పీపీటీసీటీ సిబ్బందికి సర్టిఫికెట్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ అవార్డు దక్కింది. హెచ్‌ఐవీ రోగులకు నిరంతరం అందిస్తున్న సేవలను గుర్తించి నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ రాష్ట్రంలోని కొన్ని ఆస్పత్రులను గుర్తించి సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు ఇచ్చారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని ఘోషా ఆస్పత్రి పీపీటీసీటీ సిబ్బందికి కూడా అవార్డు ప్రకటించారు. దీంతో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కె. పద్మలీల, ఆస్పత్రి సూపరింటిండెంట్ అప్పలనాయుడు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి కె.రాణి పీపీటీసీటీ కౌన్సిలర్లు ఈ.పద్మావతి, టి. గోపాలరావు, ల్యాబ్ టెక్నీషియన్ గౌరీశంకర్‌లకు సోమవారం అవార్డు అందజేశారు.

కన్నవారిని కడతేర్చిన కసాయి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు, వెనుక ముసుగులో నిందితుడు

విజయనగరం క్రైమ్: ఆస్తి కోసం జన్మనిచ్చిన తల్లిదండ్రులనే కాటికి పంపించాడో కసాయి కొడుకు. తోడబుట్టిన చెల్లికి ఆస్తిలో వాటా ఇచ్చారన్న అక్కసుతో కన్నవారిని ట్రాక్టర్‌తో తొక్కి చంపాడు. ఈ సంఘటన ఈ నెల 26న పూసపాటిరేగ మండలం రెల్లివలసలో చోటుచేసుకోగా.. నిందితుడ్ని సోమవారం అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ శ్రీనివాసరావు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. రెల్లివలసకు చెందిన పొంద్రంకి అప్పలనాయుడు, జయమ్మ దంపతులకు రాజశేఖర్, రాధాకుమారి సంతానం. కూతురు రాధను ఆనందపురం మండలం నెలతేరు గ్రామానికి చెందిన వ్యక్తితో పెళ్లి చేసి 30 సెంట్ల భూమిని పసుపు,కుంకుమ కింద ఇచ్చారు. కుమారుడు రాజశేఖర్ భార్యాబిడ్డలతో రెల్లివలసలోనే వేరేగా ఉంటున్నాడు. అతనికి రూ. 12 లక్షలు అప్పు ఉండడంతో 70 సెంట్ల భూమిని తనకు ఇవ్వాలని తల్లిదండ్రులతో ఎప్పటికప్పుడు గొడవ పడేవాడు. ఇటీవల రైతుభరోసా కోసం రాజశేఖర్ దరఖాస్తు చేయగా.. తండ్రి పేరుమీద 40 సెంట్ల భూమి.. సోదరి రాధ పేరుమీద 30 సెంట్ల భూమి ఉన్నట్లు తెలుసుకున్నాడు. వెంటనే గ్రామపెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించినా తేలకపోవడంతో.. ఈ నెల 26న సోదరి పేరుమీదున్న భూమిని చదును చేసేందుకు సిద్ధమయ్యాడు. ఈ సమయంలో అడ్డుకోవడానికి వచ్చిన తల్లిదండ్రులను ట్రాక్టర్‌తో తొక్కి చంపాడు. సోదరి రాధ ఫిర్యాదు మేరకు ఎస్సై దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి... సోమవారం నిందితుడ్ని అరెస్ట్ చేశారు.

పోటెత్తిన అర్జీదారులు

- కిటకిటలాడిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- పెన్షన్ కోసం వచ్చిన వారే అధికం
- గడువులోగా వినతులకు పరిష్కారం : కలెక్టర్ అంబేడ్కర్


వినతులు పరిశీలిస్తున్న లెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జీదారులు పోటెత్తారు. పెన్షన్ మంజూరు కోసమే ఎక్కువ మంది రావడంతో కలెక్టరేట్ కిటకిటలాడింది. మొత్తం 188 వినతులు రాగా అందులో 30 వరకు పెన్షన్లకు సంబంధించినవి కావడం విశేషం. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మాట్లాడుతూ.. వచ్చే వినతులను సంబంధిత లాగిన్‌లో అధికారులు పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. అలాగే రీ ఓపెన్ కేసులపై విచారణ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అంతకుముందు జేసీ సేతు మాధవన్, డీఆర్‌ఓ శ్రీనివాసమూర్తి, డిప్యూటీ కలెక్టర్లు మురళి, ప్రమీలతో కలిసి వినతులు స్వీకరించారు. మొత్తం 188 అర్జీలు అందగా భూ సమస్యలకు సంబంధించి రెవెన్యూ శాఖకు అత్యధికంగా 80 వినతులు అందాయి. పంచాయతీరాజ్ శాఖకు 15.. పింఛన్లు మంజూరు చేయాలని, తదితర అంశాలపై డీఆర్‌డీఏకు 30.. మున్సిపాలిటీకి 07.. జీఎస్‌డబ్ల్యూకు 06.. విద్యాశాఖకు 05.. హౌసింగ్‌కు 02 .. విద్యుత్ శాఖకు 02.. వైద్యశాఖకు ఒకటి.. మిగిలినవి ఇతర శాఖలకు సంబంధించినవి.

సమయ పాలన పాటించాలి..

ప్రభుత్వ కార్యాలయాలకు హాజరయ్యే అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. చాలా మంది విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రతిరోజూ ఉదయం 10.45 గంటలకు అన్ని కార్యాలయాల హాజరు పట్టీని ఫొటో తీసి డీఆర్‌ఓకు పంపించాలని ఆదేశించారు. అలాగే వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవడంతో పాటు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

త్వరితగతిన పరిష్కరించాలి

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం టౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అందిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో 88 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ, రీసర్వే, భూ వివాదాలు, ఉపాధి అవకాశాలు పౌరసరఫరా సేవలు, గృహపట్టాలు, తదితర అంశాలపై అర్జీలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ హేమలత, కేఆర్‌సీసీ ప్రత్యేక ఉపకలెక్టర్ పి. ధర్మచంద్రారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ఎస్. సుధారాణి, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

వచ్చిన అర్జీల్లో కొన్ని..

- బాలగుడబ లంకెల చెరువును ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని నీటి వినియోగదారుల సంఘ అధ్యక్షుడు పి. అప్పారావు ఫిర్యాదు చేశారు.
- కురుపాం మండలం లండగొల్లిగూడ గ్రామంలో బాలింతలు, గర్భిణులు, చిన్నారులు ఎక్కువగా ఉన్నందున గ్రామానికి మినీ అంగన్‌వాడీ కేంద్రం మంజూరు చేయాలని చేయాలని బి. ఇందిరమ్మ, తదితరులు వినతిపత్రం అందజేశారు.
- గుమ్మలక్ష్మీపురం మండలం వనకాబడి, వండిడి గ్రామాలకు ఆశా కార్యకర్తల పోస్టులు కేటాయించి, భర్తీ చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరారు.
- జియ్యమ్మవలస మండలం తురకనాయుడువలస గ్రామానికి చెందిన ఎ. సూరమ్మ వందశాతం అంగవైకల్యంతో బాధపడుతున్నానని, పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేసింది.

క్రైమ్ కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు


లారీ కింద చిక్కుకున్న మెరుగు బాలాజీ


మృతి చెందిన కోటపర్తి లక్ష్మణరావు

గజపతినగరం: మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల జంక్షన్ (మెంటాడ జంక్షన్) వద్ద లారీ ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై కె.కిరణ్‌కుమార్ నాయుడు తెలియజేసిన వివరాల ప్రకారం.. విశాఖపట్నం జిల్లా మధురవాడకు చెందిన మెరుగు బాలాజీ (25), అనంతగిరి మండలం రొంపిల్లి పంచాయతీ మూలవలస గ్రామానికి చెందిన కోటపర్తి లక్ష్మణరావు ద్విచక్ర వాహనంపై మధురవాడ నుంచి అనంతగిరి మండలం మూలవలసకు బయలుదేరారు. సరిగ్గా గజపతినగరం మండల కేంద్రంలోని నాలుగురోడ్ల జంక్షన్ వద్దకు వచ్చేసరికి విశాఖపట్నం నుంచి రాయ్‌పూర్ వెళ్తున్న బొగ్గు లారీ వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో ద్విచక్ర వాహనం నడుపుతున్న కోటపర్తి లక్ష్మణరావు అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న బాలాజీ లారీ చక్రం కింద ఇరుక్కుపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే క్షతగాత్రుడ్ని స్థానికులు గజపతనగరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ చోటేలాల్ (మధ్యప్రదేశ్)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతుడు, క్షతగాత్రుడు మధురవాడలో ప్లంబింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవారు. క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వ్యక్తి..


గుర్తు తెలియన వ్యక్తి మృతదేహం

కొత్తవలస: మండలంలోని విజయనగరం – కొత్తవలస రోడ్డులో కంటకాపల్లి గ్రామ సమీపంలో సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో గుర్తు తెలియని వ్యక్తి (సుమారు 40 సంవత్సరాలు) మృతి చెందాడు. మృతుడు ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వాడై .. సమీపంలోని శారదా కర్మాగారంలో పని చేసేందుకు వచ్చి ఉండవచ్చని సీఐ షణ్ముఖరావు అభిప్రాయపడ్డారు. మృతుడిని గుర్తించేందుకు ఎటువంటి ఆధారాలు లభించలేదని చెప్పారు. గ్రామ రెవెన్యూ కార్యదర్శి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సిమెంట్ పోల్ ఢీకొని వ్యక్తి..


తలగాపు రమేష్ మృతదేహం

కొమరాడ: మండల కేంద్రంలోని ఇందిరానగర్‌లో నివాసం ఉంటున్న తలగాపు రమేష్ (41) సోమవారం జరిగి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఎస్సై కె. నీలకంఠం తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. తలగాపు రమేష్ మండలంలోని కుమ్మరిగుంటకు చెందిన వాడు కాగా.. తాపీమేస్త్రిగా పని చేస్తూ ఇందిరానగర్‌లో ఉంటున్నాడు. సోమవారం సాయంత్రం పని పూర్తి చేసుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా.. తులసివలస సమీపంలో రోడ్డుపక్కనున్న సిమెంట్ పోల్‌కు గుద్దుకుని తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు స్పందించి వెంటనే అతడ్ని కురుపాం ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య సుమ, ముగ్గురు పిల్లలున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసులో ముద్దాయికి యావజ్జీవజైలుశిక్ష

విజయనగరం క్రైమ్: విజయనగరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో 2021లో నమోదైన పోక్సో కేసులో ఏలేశ్వరంనకు చెందిన నిందితుడు శివకుమార్ (29)కు యావజ్జీవ శిక్ష విధిస్తూ విజయనగరం జిల్లా పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి నాగమణి తీర్పు ఇచ్చినట్లు ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. సోమవారం ఆయన తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరంలో ఉంటున్న 16 ఏళ్ల బాలికతో తూర్పుగోదావరి జిల్లా ఏలేశ్వరంలో చైతన్యనగర్‌కు చెందిన శివకుమార్ పరిచయం పెంచుకున్నాడు. హోటల్ మేనేజ్‌మెంట్ కోర్స్ చేస్తున్నట్లు సదరు బాలికతో అబద్ధాలు చెప్పి పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి, శారీరకంగా దగ్గరయ్యాడు. ఈ క్రమంలో బాధితురాలు గర్భం దాల్చి ఓ బాబుకు జన్మనిచ్చింది. ఈ సమయంలో తనను పెళ్లి చేసుకోవాలని బాధితురాలు కోరగా.. శివకుమార్ కులం పేరుతో దూషించాడు. దీంతో బాధితురాలు విజయనగరం వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేయగా.. అప్పటి సీఐ మురళి కేసు నమోదు చేసి దిశ పీఎస్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. అప్పటి దిశ డీఎస్పీ త్రినాథ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి యావజ్జీవ జైలుశిక్షతో పాటు రూ. 13 వేల జరిమాన విధించారు.

డీసీసీబీ చైర్మన్‌గా కిమిడి

- ఎమ్మెల్యే టికెట్ త్యాగం చేసిన నాగార్జున
- ఎమ్మెల్సీ ఇస్తామని చెప్పి డీసీసీబీ చైర్మన్‌తో సరిబెట్టిన అధిష్టానం


కిమిడి నాగార్జున

చీపురుపల్లి: టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జునను డీసీసీబీ చైర్మన్‌గా నియమిస్తూ ముఖ్యమంత్రి కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా పది జిల్లాలకు డీసీసీబీ చైర్మన్లను నియమించారు. ఈ క్రమంలో విజయనగరం జిల్లా పదవి నాగార్జునను వరించింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నాగార్జునకు ఎమ్మెల్సీ పదవి వస్తుందని ఆయన అనుచరవర్గం ఎదురు చూసింది. కానీ ఎమ్మెల్సీ పదవి లేదు సరికదా కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లోనూ ఆయన పేరు కనిపించలేదు. దీంతో ఏడాది కాలంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా పార్టీకి సేవలు అందిస్తూ వస్తున్నారు. చివరకు డీసీసీబీ చైర్మన్ పదవిని కట్టబెట్టి నాగార్జునతో పాటు ఆయన అనుచరవర్గాన్ని అధిష్టానం చల్లబరిచే ప్రయత్నం చేస్తోందనే చర్చ నడుస్తోంది. 2016లో అమెరికా నుంచి వచ్చిన నాగార్జున టీడీపీలో యాక్టివ్‌గా ఉంటూ 2019 ఎన్నికల్లో చీపురుపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచారు. ఓటమి చెందినప్పటికీ తిరిగి అమెరికా వెళ్లకుండా నియోజకవర్గంలోనే ఉంటూ పార్టీ బలోపేతానికి కోసం కృషి చేశారు. 2024 ఎన్నికల్లో ఆయనే ఎమ్మెల్యే అభ్యర్థి అని క్యాడర్ అంతా చెప్పుకున్నారు. కానీ పార్టీ అధిష్టానం మాత్రం ఆయన పెదనాన్న కిమిడి కళా వెంకటరావుకు టిక్కెట్ ఖరారు చేసింది. ఆ సమయంలో తీవ్ర మనస్తాపానికి గురైన నాగార్జున కొద్ది రోజులు పార్టీకి దూరంగా ఉన్నప్పటికీ.. తర్వాత పార్టీ జిల్లా అధ్యక్షుడిగా సేవలు అందిస్తున్నారు. ఇదిలా ఉంటే నాగార్జునకు ఎమ్మెల్సీ రాకుండా సొంత మనుషులే అడ్డుకున్నారన్న ప్రచారం కూడా ఉంది. మొత్తం మీద నాగార్జునకు డీసీసీబీ చైర్మన్ పదవి ఖరారవ్వడంతో ఆయన నివాసం వద్ద అనుచర వర్గం బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష


అధికారులకు సూచనలిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్మోహనరావు

సంతకవిటి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పలువురు అధికారులతో జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు సోమవారం సమావేశమై, అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. రాజకీయాలకు అతీతంగా అందరూ సమన్వయంతో మండల అభివృద్ధికి పాటుపడాలని కోరారు. వేసవి నేపథ్యంలో ఎక్కడా తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని జెడ్పీ వైస్ చైర్మన్ సూచించారు. సమావేశంలో ఎంపీడీవో కె.సురేష్‌కుమార్, ఏపీవో ఆర్.హరనాథరావు, కాకరాపల్లి సర్పంచ్ వి.రమణారావు, గొల్లవలస సర్పంచ్ డి.దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.